సాక్షి సంగారెడ్డి

శనివారం । 26 । ఏప్రిల్ । 2025



చిరుతపులి కలకలం

రాయపోల్ మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో చిరుత పులి కలకలం సృష్టించింది. వివరాలు IIలో ▸



ఏడాదిలో నలుగురు ఎస్సైలు

జిల్లాలోని వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏడాదిలో నలుగురు ఎస్సైలు మారారు.

వివరాలు IIIలో ▸



వేగంగా నిమ్జ్‌రోడ్డు పనులు

జహీరాబాద్, ఝరాసంగం మండలాల్లో నిమ్జ్ రోడ్డు పనులు ఊపందుకున్నాయి.

వివరాలు IIIలో ▸

న్యూస్‌రీల్

గాలికుంటు టీకాలు తప్పనిసరి: విజయ్



వివరాలు అడిగి తెలుసుకుంటున్న జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్

పటాన్‌చెరుటౌన్: పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే గాలికుంటు టీకాలు తప్పని సరిగా వేయించాలని కేంద్ర పశుసంవర్ధక శాఖ జాయింట్ కమిషనర్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామ సమీపంలోని గోశాలలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమానికి విజయ్ కుమార్ హాజరై వ్యాక్సినేషన్‌పై ఆరా తీయడంతోపాటు గోశాలలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి శైలేంద్ర జస్వాల్, గోశాల కార్యదర్శి గిరిధర్, డాక్టర్ లు జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన పాలన



శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌ఓ పద్మజారాణి

సంగారెడ్డి జోన్: ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన పాలన అందించటం సాధ్యమవుతుందని డీఆర్‌ఓ పద్మజారాణి పేర్కొన్నారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు సమాచార హక్కు చట్టం, గ్రామసభల నిర్వహణ అంశాలపై రెండు రోజులపాటు నిర్వహించిన అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. కలెక్టరేట్ కార్యాలయంలో అవగాహన సదస్సును నిర్వహించారు. గ్రామసభల నిర్వహణ, సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం అందించడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 35 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మలేరియాపై జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి



ర్యాలీని ప్రారంభిస్తున్న గాయత్రీదేవి

సంగారెడ్డి: ప్రతీ ఒక్కరూ మలేరియాపై జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించి ఆమె మాట్లాడుతూ...ఈగలు, దోమలు, అపరిశుభ్ర వాతావరణం లేకుండా ప్రతీ ఒక్కరు చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై నజర్

పిల్లల సంఖ్య పెంచేలా చర్యలు

- ఉన్నతాధికారుల పర్యవేక్షణ తప్పనిసరి
- గ్రేడింగ్ విధానం అమలుకు నిర్ణయం



అంగన్‌వాడీ కేంద్రం

జహీరాబాద్: ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాలు మొక్కుబడిగా నిర్వహించకుండా ఉన్నతాధికారుల పర్యవేక్షణ తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. చిన్నారులు కేంద్రాలకు వచ్చి పోవడంతోనే సరిపెట్టకుండా వారికి ఆటాపాట నేర్పించాలనే దానిపై దృష్టి పెట్టింది. అందుకే అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు ఆధారంగా గ్రేడింగ్ ఇవ్వనున్నట్లు ఇటీవల ఉన్నతాధికారులతో మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చెప్పిన విషయం తెలిసిందే. మంచి గ్రేడింగ్ ఉన్న కేంద్రాలకు అవార్డులను సైతం ఇవ్వనున్నట్లు పేర్కొంది. చిన్నారులు లేరనే సాకులతో కేంద్రాలను మూసివేయడం సరి కాదని, ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసుకుని సంఖ్యను పెంచడంపై దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మార్చుకునే అవకాశం

ప్రస్తుతం నిర్వహిస్తున్న కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్నట్లయితే ఎక్కువ సంఖ్య వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాలకు కేంద్రాలను మార్చుకునే అవకాశం కల్పించింది. ప్రతీ కేంద్రంలో తప్పనిసరిగా 20 మంది సంఖ్య ఉండేలా నిర్వాహకులు చూసుకోవాల్సి ఉంటుంది. బడి బాట తరహాలోనే గ్రామాల్లో చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేందుకు ఐసీడీఎస్ అధికారులు, ఆయా కేంద్రాల నిర్వాహకులు ప్రయత్నాలు చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే కేంద్రాల నిర్వహణ సరిగ్గా లేదనే భావన ఉంది. చిన్నారుల సంక్షేమంపై భారీగా ఖర్చు పెడుతున్నా అధికారులు సరిగ్గా పని చేయడం లేదనే అపోహ ప్రభుత్వం దృష్టిలో ఉంది. దీన్ని సరిచేసేందుకుగాను ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని యోచిస్తోంది. అందులోభాగంగానే జిల్లా సంక్షేమాధికారులు వారానికి కనీసం మూడు కేంద్రాలను అయినా సందర్శించేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

కొనుగోలు కమిటీల ద్వారా టెండర్లు

ఇదిలా ఉంటే అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన సరుకులు సరఫరా అయ్యేలా దృష్టి పెట్టింది. సరుకుల కొనుగోళ్ల విషయంలో సొంత నిర్ణయాలకు అవకాశం లేకుండా చేసింది. ఈ–టెండర్ విధానాన్ని పాటించేలా సూచనలు జారీ చేసినట్లు సమాచారం. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా కొనుగోలు కమిటీ ద్వారా టెండర్లు పిలవాలని ప్రభుత్వం తప్పనిసరి చేసింది. కోడిగుడ్లు సరిగ్గా సరఫరా జరిగేలా చూసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

“అంగన్‌వాడీ బాటతో సంఖ్య పెంచుతాం



కేంద్రాలకు విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకుగాను మే నెలలో అంగన్‌వాడీ బాట కార్యక్రమం చేపడతాం. కేంద్రం నిర్వాహకులు ప్రతీ ఇంటికి వెళ్లి చిన్నారుల గురించి ఆరా తీస్తారు. రెండేళ్లు నిండిన చిన్నారులను కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం. సంఖ్య తక్కువ ఉన్న పట్టణ ప్రాంతాల్లోని రెండు మూడు కేంద్రాలను ఎక్కువ ఉన్న ప్రాంతాలకు మార్పించాం. కేంద్రాల పనితీరుపైనే ఎక్కువ దృష్టి పెట్టడం జరుగుతోంది.

–లలితకుమారి, జిల్లా సంక్షేమాధికారి, సంగారెడ్డి ”

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీలు

జోగిపేట సీడీపీఓ ప్రియాంక



మాట్లాడుతున్న ప్రియాంక

జోగిపేట(అందోల్): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, ఆటపాటలతో విద్యాబోధన చేస్తున్నట్లు జోగిపేట ఐసీడీఎస్ సీడీపీఓ ప్రియాంక స్పష్టం చేశారు. అంగన్‌వాడీ దినోత్సవాన్ని 6,11,14,15,16 కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలలో 3 నుంచి ఆరేళ్లలోపు ఉన్న చిన్నారులను కేంద్రాలలో చేర్పించాలన్నారు. కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని వివరించారు. చిన్నారులకు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కేంద్రంలో చిన్నారులకు ఫలితాల సర్టిఫికెట్లు అందించారు.

పాక్‌పై చర్యలు తీసుకోవాలి



పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ముస్లింల ప్రదర్శన

ఇస్నాపూర్ చౌరస్తాలో ముస్లిం సోదరులు

పటాన్‌చెరు టౌన్: పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై ముస్లిం సమాజం మండిపడింది. మతం పేరిట మారణహోమం సృష్టించినవారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టకూడదని వారంతా నినదించారు. ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తూ పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో శుక్రవారం ముస్లిం సోదరులు నిరసనలు చేపట్టారు. హిందూ ముస్లిం మతకలహాలను సృష్టించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్న పాకిస్తాన్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ముస్లిం సోదరులు చేతికి నల్ల బ్యాడ్జీలు ధరించి నమాజులు చదివారు. ఉగ్రవాదంపై కేంద్రం తీసుకునే చర్యలకు ముస్లిం సమాజం వెన్నంటే ఉంటుందని మైనారిటీ నాయకులు మేరాజ్ ఖాన్, అబెద్, మునీరుద్దీన్, మీర్ ముహియుద్దీన్, నాసర్, కలీం పేర్కొన్నారు. కార్యక్రమంలో బాసిత్, ఇంతియాజ్, అన్వర్, మస్తాన్, అజీజ్, ఫైయజ్, గౌస్, నసీర్, సల్మాన్, సోఫీ, తదితరులు పాలొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇంటి పనులు ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. మనూరు మండలం దుదగొండ పంచాయతీ పరిధిలోని గట్‌లింగంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదల సొంతింటి కల నెరవేరిందని గుర్తు చేశారు. మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే పేదలకు పక్కా ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటికి రూ.5లక్షలు చెల్లించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు బ్రహ్మానందరెడ్డి, రాజు, ఘాజీ సర్పంచ్ ధన్‌రాజ్ పాటిల్, సంజీవరెడ్డి పాల్గొన్నారు. అలాగే, ఖేడ్ మండలం ర్యాకల్‌లో 23న ప్రారంభమైన ఎల్లమ్మ తల్లి జాతర ఉత్సవాలు మూడవరోజూ శుక్రవారం కొనసాగాయి. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఝరాసంగం(జహీరాబాద్)/న్యాల్‌కల్(జహీరాబాద్)/జహీరాబాద్ టౌన్: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన భూభారతిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి రైతులకు సూచించారు. ఝరాసంగం, న్యాల్‌కల్, కోహీర్‌లో శుక్రవారం నిర్వహించిన భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులకు కలెక్టర్ క్రాంతి హాజరై మాట్లాడారు. కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, అదనపు కలెక్టర్ మాధురిలతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి చట్టం–2025 (ఆర్‌ఓఆర్) జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందన్నారు. ఇందులో సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ఈనెల 14న ప్రభుత్వం ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు. భూ భారతి చట్టంతో భూ సమస్యలున్న రైతులు ఇక న్యాయస్థానాల చుట్టూ తిరగనవసరం లేదని వివరించారు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టర్‌తోపాటు సీసీఎల్‌లో అప్పీలు చేసుకునే సౌకర్యం ఉందని, ఈ చట్టంలో కొత్తగా ల్యాండ్ ట్రిబ్యూనల్ అందుబాటులో ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టం ద్వారా నిర్దిష్ట సమయంలోగా తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. భూ సమస్యలు స్థానికంగానే పరిష్కరించుకునేందుకు రెవెన్యూ డివిజన్, అధికారి కలెక్టర్‌కు అధికారాలు కల్పించారని తెలిపారు. ప్రతీ గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామంలో ప్రదర్శిస్తారని వివరించారు. భూభారతి చట్టంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. భూ భారతి చట్టం ద్వారా 90 శాతం సమస్యలు మండల స్థాయిలో పరిష్కారమవుతాయని తెలిపారు. రైతులకు సంబంధించిన భూ హద్దులు ఇక పక్కాగా నిర్ణయించడం జరుగుతుందని, సాదాబైనామ పరిష్కారం కోసం త్వరలోనే మార్గదర్శకాలు వెలువడుతాయని కలెక్టర్ వెల్లడించారు.

ఇందిరమ్మ ఇండ్ల చెక్కుల అందజేత

నిరుపేదలైన వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. బేస్‌మెంటు లెవెల్ పూర్తి చేసిన లబ్ధిదారులకు రూ.1 లక్ష చొప్పున చెక్కులను అందించారు. జహీరాబాద్ ఆర్‌డీఓ రాంరెడ్డి మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యలను నూతన చట్టం ద్వారా రైతులు సులభంగా పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా భూభారతి చట్టం–2025తో పాటు, భూసమస్యలను ఏవిధంగా పరిష్కరించుకోవచ్చుననే అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరపతిరెడ్డి, ఏపీఎస్ చైర్మెన్ సిద్ధిలింగయ్యస్వామి, వ్యవసాయశాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, ఆయా మండలాల తహసీల్దార్లు , నాయకులు హన్మంతరావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ధర చెల్లించాలి

ప్రజాభిప్రాయ సేకరణలో జిన్నారం రైతులు



గ్రామ సభలో మాట్లాడుతున్న మహిళారైతు. చిత్రంలో అధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): మార్కెట్ ధర ప్రకారమే రైతులకు న్యాయం చేయాలని, వారికి ఎదురయ్యే సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిన్నారం రైతులు విజ్ఞప్తి చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 109లో పారిశ్రామిక వాడ ఏర్పాటు కోసం శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు వారు హాజరై వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.... పారిశ్రామిక వాడ ఏర్పాటు నేపథ్యంలో మార్చి 7న భూసేకరణ ప్రారంభించామన్నారు. 2013 చట్టం ప్రకారం భూసేకరణ ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు రైతుల నుంచి అభిప్రాయాలు అడిగితెలుసుకున్నారు. పారిశ్రామికవాడ ఏర్పాటయితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉంటాయన్నారు. పరిశ్రమలు ఏర్పడితే ఈ ప్రాంతం త్వరితగతిన అభివృద్ధిలోకి వస్తుందన్నారు. అనంతరం రైతు నాయకులు మాట్లాడుతూ...ఇప్పటికే 98 మంది రైతులు ఉన్నారని, రైతులందరూ వారి డాక్యుమెంట్లను సబ్మిట్ చేయాలన్నారు. వీటిలో ఏవైనా తప్పులు ఉన్నా, ఎవరి పేరైనా రాకపోయినా, వాటిలో భూమి వివరాలు పడకపోయినా, ఒకవేళ రైతు చనిపోయిన, లేదా భార్య లేదా ఇతర కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న రికార్డుల్లో మార్పులు చేర్పులు సరి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పరమేశం, ఆర్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది, స్థానిక నాయకులు రైతులు పాల్గొన్నారు.

మామిడి కాయకు కవర్

మధుర ఫలానికి రక్షణ

- వినూత్న విధానంలో సాగు
- పెరుగుతున్న కవర్ల వినియోగం



మామిడి కాయలకు కట్టిన కవర్లు



నీట్‌గా ఉన్న కవర్ కట్టిన కాయలు

జహీరాబాద్ టౌన్: పెరిగిన పెట్టుబడులతో పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం జిల్లాలోని కొంత మంది రైతులు వినూత్న ఆలోచనలతో వ్యవసాయంలో ముందుకు వెళ్తున్నారు. కొంచెం ఖర్చు ఎక్కువైనా మంచి ఆదాయం పొందుతున్నారు. చీడపీడల నుంచి రక్షణ, బరువు పెరిగి అధిక లాభాలు రావడానికి మామిడి కాయలకు కవర్లు కడుతున్నారు. సాధారణంగా కంటే కూడా కవర్లలో పెరిగే మధుర ఫలం నాణ్యతతో పాటు ఆకర్షణీయంగా కనిపిస్తుంది. దీంతో రైతులకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది.

లాభాలు అనేకం



వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల మామిడి చెట్లు పూత పూసినా కాత నిలబడటం లేదు. 60 నుంచి 70 శాతం పిందె రాలిపోతోంది. ఈ పరిస్థితిలో పంటను కాపాడుకొని దిగుబడి పెంచుకోవడం రైతులకు కష్టమవుతోంది. కాయకు కవర్ కట్టే విధానం వల్ల అనేక లాభాలు ఉన్నాయి. మామిడి కాయ కోడిగుడ్డు సైజులోకి రాగానే కవర్లు కడతారు. దీని వల్ల తొడిమ వద్ద నల్లగా మసి రావడం, పురుగు పట్టడం, సొన కారడం లాంటివి తగ్గుతాయి. దీంతో పురుగు మందుల అవసరం చాలా వరకు ఉండదు. ఈదురు గాలులు, వడగండ్ల వానకు కాయలు రాలవు. మాములు కాయకంటే బరువు ఎక్కువగా ఉంటుంది. చూసేందుకు పండ్లు నీట్‌గా ఉంటాయి. చెట్టుపైనే పక్వానికి రావడం వల్ల అధిక ధర పలుకుతుంది.

ఖర్చు ఎక్కువ

మామిడి కాయలకు కవర్ కట్టడం వల్ల కొంచెం ఖర్చు ఎక్కువ. ఒక్కో బ్యాగ్‌కు రూ. 2.50 పైసలకు లభిస్తుంది. కట్టడానికి రూ.2.50 కూలీ ఖర్చు అవుతుంది. ఈ బ్యాగ్ లోపలివైపున నల్లరంగు, బయటవైపు గోధుమ రంగులో ఉంటుంది. వీటిని కట్టడానికి ముందు కాయలను బట్టతో శుభ్రం చేయాలి. కాయ కింది భాగం నుంచి తొడిమ పైభాగంలో మూడు సెంటీమీటర్ల పైన కట్టాలి.

అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

మామిడి కాయలకు కవర్లు కట్టడం వల్ల కలిగే లాభాల గురించి కొండా లక్ష్మణ్ ఉద్యాన కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని రంజోల్ గ్రామ పరిధిలోని మామిడి తోటల వద్ద రైతులకు ప్రాక్టికల్‌గా కవర్లు కట్టడం చూపిస్తున్నారు. ఈ విధానం వల్ల కాయ బరువు పెరిగి రైతులకు అధిక లాభాలు వస్తాయని చెబుతున్నారు.

పూత నుంచి కోత వరకు..

మామిడి చెట్లకు పూత వచ్చినప్పటి నుంచి కాయలు కోతకు వచ్చే వరకు కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి వస్తోంది. అధిక ఉష్ణోగ్రతలు, వడగండ్ల వాన, ఈదురుగాలులు, చీడపీడల బెడద కారణంగా పంటకు తీవ్ర నష్టం కలుగుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు మ్యాంగో ప్రొటెక్షన్ బ్యాగ్స్(కాయలకు రక్షణ సంచులు)ను ఏర్పాటు చేస్తున్నారు. కాయలకు కవర్లు కట్టడం వల్ల పండ్లలో నాణ్యత ప్రమాణాలు పెరిగి రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది. ఈ మామిడి పండ్లను విదేశాలకు ఎగుమతి చేయవచ్చు.

కవర్లను సబ్సిడీపై ఇవ్వాలి

జహీరాబాద్ పట్టణ సమీపంలో గాయత్రి పామ్‌హౌస్‌లో సుమారు 30 ఎకరాల్లో మామిడి తోట ఉంది. సుమారు 4 లక్షల కవర్లు కట్టాం. మూడేళ్ల నుంచి కాయలకు కవర్లు కడుతున్నాం. మామూలు కాయకంటే కవర్ కట్టిన కాయ చాలా నీట్‌గా అధిక బరువు ఉంటుంది. కానీ కవర్ల ఖర్చు ఎక్కువ అవుతోంది. ఒక్కో కవర్ రెండు నుంచి మూడు రుపాయలకు లభిస్తుంది. కట్టడానికి కూలీల ఖర్చు కూడా అవుతుంది. ఈ బ్యాగ్‌లు హైదరాబాద్‌లో దొరకనందున ఆంధ్రప్రదేశ్ నుంచి తెచ్చుకుంటున్నాం. ఉద్యానశాఖ తరపున కవర్లు సబ్సిడీపై ఇవ్వాలి. అప్పుడే రైతులు ముందుకు వస్తారు. రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రమే సబ్సిడీపై కవర్లు ఇస్తున్నారు. ఈ జిల్లాలో కూడా ఇవ్వాలి.

– హరీశ్, మామిడి రైతు, జహీరాబాద్

‘ఉపాధి’ పనులు భేష్



ఉపాధి హామీ పథకం గురించి విదేశీ ప్రతినిధులకు వివరిస్తున్న కలెక్టర్ క్రాంతి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న విదేశీ బృందం

విదేశీ ప్రతినిధుల బృందం కితాబు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు బేషుగ్గా ఉన్నాయని విదేశీ ప్రతినిధులు కితాబిచ్చారు. వివిధ దేశాలకు చెందిన 25మంది విదేశీ ప్రతినిధులు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సృజన,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరుతో కలిసి మండలంలోని సూరారం గ్రామంలో శుక్రవారం పర్యటించారు. గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. గ్రామానికి చేరుకున్న విదేశీ ప్రతినిధుల బృందానికి కలెక్టర్ క్రాంతి వల్లూరు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు కూలీలతో మాట్లాడి పథకం అమలుపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఉపాధి అవకాశాలు, వేతన చెల్లింపులు,మహిళల భాగస్వామ్యం వంటి అంశాలపై సమగ్ర సమాచారం సేకరించారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ సృజన,జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు విదేశీ బృందానికి నీటి సంరక్షణ,పల్లె ప్రగతి కింద చేపడుతున్న పనులపై, సామాజిక తనిఖీపై వివరించారు.విదేశీ ప్రతినిధులు తెలంగాణలో పథకం అమలు పద్ధతులను మెచ్చుకున్నారు.ప్రత్యేకించి డిజిటల్ మానిటరింగ్ విధానాలు,పారదర్శక చెల్లింపుల వ్యవస్థలు, మహిళల భాగస్వామ్యం వంటి అంశాలను వారు ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశాల్లో లేని ఈ ఉపాధి హామీ పథకం భారతదేశంలో మాత్రమే ఉందని మెచ్చుకున్నారు. అంతకుముందు ఉపాధి హామీ పథకంలో చేసిన పనులతో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోశ్ పంకజ్ ,అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అదనపు కమిషనర్ శేషుకుమార్, ఎస్పీఎం మురళీ, పీడీ జ్యోతి,అదనపు డీఆర్డీఓలు బాలరాజు, జంగారెడ్డి, ఎన్జీవో ప్రతినిధులు వర్షిణి, పంచాయతీరాజ్ రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళల రక్షణకు పెద్దపీట

● సమావేశంలో సీపీ అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మహిళల రక్షణకు పెద్దపీట వేయాలని సీపీ అనురాధ పేర్కొన్నారు. శుక్రవారం పోలీసు కమిషనరేట్‌లో హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీటీఎన్ఎస్ డాటా ప్రకారం క్రైమ్ రివ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన టెక్నాలజీ ఉపయోగించడం, నేర్చుకోవడం చాలా ముఖ్యమన్నారు. రౌడీలు, అనుమానితులను తనిఖీ చేసి వారిపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లపై రైతులు ధాన్యం ఆరబెట్టకూడదని సూచించారు. అడవిపందుల నుంచి పంట రక్షణ కోసం చుట్టూ కరెంటు వైర్లు ఏర్పాటు చేస్తున్నారని రైతులను పిలిచి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులను విచారణ చేసి త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐలు శ్రీనివాస్, శ్రీను, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగి వ్యక్తి మృతి



వీరస్వామి

పాపన్నపేట(మెదక్): దర్శనానికి వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల ఆలయం వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... నాగర్ కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం మరికెల్ గ్రామానికి చెందిన వీరస్వామి (40) తన భార్యాపిల్లలతో కలిసి బంధువుల విందులో పాల్గొనడానికి శుక్రవారం ఏడుపాయలకు వచ్చాడు. అనంతరం అమ్మవారిని దర్శించుకునేందుకు చెక్‌డ్యాంలో స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు.

ఏడుపాయల్లో మృతదేహం గుర్తింపు

● కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం
● అనంతరం పూడ్చివేసిన పోలీసులు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని గంగాపూర్ గ్రామానికి చెందిన మహేశ్(37)ను గత నెల 26న నగల కోసం తీసుకొచ్చి హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు పాపన్నపేట మండలం ఏడుపాయల శివారులోని మొదటి బ్రిడ్జి వద్ద హత్య చేసినట్లు అక్కడ ఉన్న ఆనవాళ్లను బట్టి మహేశ్ మృతదేహంగా గుర్తించారు. శవం కుళ్లిపోయి ఉండటంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి పూడ్చివేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి వివరాల ప్రకారం ... చేగుంట శివారులోని మక్కరాజీపేట బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. కాగా మృతుడికి సంబంధించిన వివరాలు తెలియలేదు. మృతుడు గోధుమరంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించినట్లు తెలిపారు.

కోల్డ్ స్టోరేజీ గోదాం ప్రమాదానికి కారణమైన వ్యక్తి అరెస్టు

కొండపాక(గజ్వేల్): అరటి పండ్ల కోల్డ్ స్టోరేజీ గోదాంలో అగ్ని ప్రమాదానికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం ప్రకారం... కొండపాక మండలంలోని మర్పడ్గ గ్రామ శివారులో సిద్దిపేటకు చెందిన వ్యాపారులు అరటి పండ్ల కోల్డ్ స్టోరేజీ గోదాంను ఏర్పాటు చేశారు. ఈనెల15న కోల్డ్ స్టోరేజీ పక్కన భూమిని కౌలుకు తీసుకున్న రైతు రాజయ్య ఖరీఫ్ సీజన్ పనుల కోసం పత్తి పొరకకు నిప్పంటించాడు. మంటలు ఒక్కసారిగా కోల్డ్ స్టోరేజీ గోదాంలోకి ప్రవేశించి రూ. 1.50 కోట్ల ఆస్తి నష్టం జరిగింది. ఈ క్రమంలో నిర్వాహకుడు మహ్మద్ అబ్దుల్ హమీద్ ఫిర్యాదు మేరకు రాజయ్యపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అరటి పండ్లను ఇవ్వడం లేదన్న కక్షతో గోదాం పక్కన పత్తి పొరకకు నిప్పంటించినట్లు పోలీసులు తెలిపారు. రాజయ్య పరారీలో ఉండటంతో శుక్రవారం అరెస్టు చేశారు.

రజతోత్సవ సభకు


ఇలా వెళ్లొద్దాం..

బీఆర్ఎస్ పాతికేళ్ల వేడుకల సభకు ఏర్పాట్లు పూర్తి

159 ఎకరాల్లో వేదిక, సభాస్థలం.. ● జనం కోసం సకల వసతులు

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పాతికేళ్ల వేడుకలకు వేళయింది. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం అంగరంగ వైభవంగా ఉద్యమ పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు నిర్వహించేందుకు వేదిక సిద్ధమైంది. తెలంగాణ అన్ని జిల్లాల నుంచి హాజరయ్యే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కోసం భారీగా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి ఐదు రూట్లలో వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. వేడుకలకు ఆ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. వేదిక ముందు లక్ష కుర్చీలు, మిగతా జనం కోసం షామియానాలు ఏర్పాటు చేశారు.

– సాక్షిప్రతినిధి, వరంగల్





హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో సిద్ధమైన సభా వేదిక

జోన్-1 వర్ధన్నపేట, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, పరకాల, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, పాలకుర్తి, ములుగు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లందు
రూట్: మల్లంపల్లి–గుడెప్పాడ్ –వంగపహాడ్– యూ టర్న్ ఎన్‌హెచ్ 163–హసన్‌పర్తి –ఎల్కతుర్తి

జోన్-2 ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలు, ఇల్లందు, వైరా, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర
రూట్: ఖమ్మంనుంచి వచ్చే వారు మామునూరు–నాయుడు పెట్రోల్ పంప్–టయోటా షోరూం–కడిపికొండ బ్రిడ్జి–మడికొండ–ఎన్‌హెచ్ 163 బైపాస్ రోడ్డు –టోల్‌గేట్–దేవన్నపేట–మడిపల్లి–అనంతసాగర్, కరుణాపురం –ఎన్‌హెచ్ 163 బైపాస్ టోల్‌గేట్–దేవన్నపేట –మడిపల్లి–అనంతసాగర్–పార్కింగ్

జోన్-3 జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్
రూట్: ధర్మసాగర్–దేవునూరు –దామెర–చింతలపల్లి–పార్కింగ్

జోన్-4 ఉమ్మడి కరీంనగర్ నియోజకవర్గాలు, చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, పరకాల (కొంతభాగం)
రూట్: కరీంనగర్, హుజూరాబాద్–కోతులనడుమ–గ్రానైట్ రోడ్డు పార్కింగ్

జోన్-5 ఉమ్మడి మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాలు, నిర్మల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్
రూట్: సిద్దిపేట–ముల్కనూరు–ఇందిరా నగర్ పార్కింగ్

పార్కింగ్ జోన్లు 5
కేటాయించిన భూమి 1,179

సభ వివరాలు

మొత్తం సేకరించిన భూమి : **1,356** ఎకరాలు
సభావేదిక : **159** ఎకరాలు



- సభకు హాజరయ్యే వారి కోసం 10 లక్షల వాటర్ బాటిళ్లు, 10 లక్షల మజ్జిగ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నారు.
- వెయ్యికి పైగా వైద్య బృందాలు, 20 అంబులెన్స్‌లు సేవలందిస్తాయి.
- నిరంతర కరెంటుకు 200 జనరేటర్ల ఏర్పాటు.

చిరుత కలకలం

● రెండు కుక్కల పై దాడి చేసి చంపిన వైనం
● ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు



చిరుత పులి పాదముద్రలు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండల పరిధిలోని వడ్డేపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మరోసారి చిరుత పులి కలకలం సృష్టించింది. రెండు కుక్కలపై దాడి చేసి చంపింది. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు చిరుత ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శుక్రవారం దుబ్బాక ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సందీప్ కుమార్ వడ్డేపల్లి గ్రామ అటవీ ప్రాంతాన్ని సందర్శించి ప్రజల నుంచి వివరాలు సేకరించారు. చిరుత పాద ముద్రలను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేముల రాజమల్లయ్య వ్యవసాయ పొలం వద్ద రెండు కుక్కలపై దాడిచేసి చంపింది చిరుతనేనని నిర్ధారించారు. దాని జాడ కోసం అడవిలో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. చిరుత ఎప్పుడు ఒకే చోట నివాసం ఉండదని తరచూ సంచరిస్తుందని సూచించారు. అడవికి దగ్గరగా వ్యవసాయ పొలాలు ఉన్న రైతులు గొర్రెలు, మేకలు, పశువులను పొలాల వద్ద ఉంచకూడదన్నారు. గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిరుత కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులెవరూ పొలాల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమేష్, బీట్ ఆఫీసర్ వేణు తదితరులున్నారు.

అప్పులు.. ఆపై కుటుంబ కలహాలు

వ్యక్తి ఆత్మహత్య



పోగాకు స్వామి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): కుటుంబ కలహాలతో వ్యక్తి ఉరేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని అల్వాలలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ పరశురామ్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన పోగాకు స్వామి (31) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ భార్య, పిల్లలను పోషిస్తున్నాడు. ఇటీవల అందినకాడికి అప్పులు చేసి రూ. 11 లక్షలతో బొలేరో వాహనాన్ని కొనుగోలు చేశాడు. వాహనం కొన్న నాటి నుంచి సరైన గిరాకీలు లేక తెచ్చిన అప్పులకు మిత్తీలు కట్టలేకపోయాడు. దీనికి తోడు ఇంట్లో భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన స్వామి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పాపన్నపేట (మెదక్): గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల కేంద్రమైన పాపన్నపేటలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం... పాపన్నపేట గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఉండటాన్ని శుక్రవారం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వ్యక్తి వయస్సు సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుంది. ఒంటిపై కుంకుమ రంగు షర్టు, నలుపు గ్రే రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని చెప్పారు. కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని బట్టి, సుమారు పది–పదిహేను రోజుల క్రితం ఉరి వేసుకొని మృతి చెంది ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి..

మునిపల్లి(అందోల్): ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేశ్ నాయక్ వివరాల ప్రకారం... ఈ నెల 23న ఉదయం శ్రీనివాస్(40) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి...



రాజు (ఫైల్)

రామాయంపేట(మెదక్): కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ఝాన్సీలింగాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కల్వాల రాజు (35) మిషన్ భగీరథ వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తన భార్యతో గొడవ పడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. అదే గ్రామంలో ఓ రైతు పంట చేను వద్ద చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



గీత(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): బాలిక అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం... మండల పరిధిలోని బిజిలీపూర్ గ్రామానికి చెందిన డప్పు గీత(15) అందోలు రెసిడెన్సియల్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. వార్షిక పరీక్షల అనతరం పాఠశాల నుంచి ఇంటికి వచ్చింది. ఈనెల 18న రాత్రి తన కుటుంబీకులతో కలిసి భోజనం చేసి అందరూ నిద్రకు ఉపక్రమించిన తర్వాత తెల్లవారు జామున ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు లేచి చూసే సరికి కూతురు కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ కనిపించలేదు. దీంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళాశాలకు వెళ్లిన విద్యార్థి..



షాహీదా ఖుతున్

జహీరాబాద్ టౌన్: కళాశాలకు వెళ్లిన విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్.ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం... పట్టణంలోని అహ్మద్‌నగర్‌కు చెందిన ఎండీ షమీమ్‌కు ఇద్దరు కొడుకులు, ఐదుగురు ఆడపిల్లలు. ఐదో కూతురు షాహీదా ఖుతున్(20) స్థానిక ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఈ నెల 23న అక్క ఆయేషా ఖుతున్‌తో కలిసి కళాశాలకు వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

ఘటనా స్థలంలో ఒకరు, చికిత్స పొందుతూ మరొకరు



బాలరాజ్



నవీన్

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ ఘటన నర్సాపూర్ – సంగారెడ్డి రహదారిలోని ఇండియన్ పెట్రోల్ పంపు సమీపంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై లింగం కథనం మేరకు... సంగారెడ్డి జిల్లా చౌటకురు మండల కేంద్రానికి చెందిన ఎల్లపోల్ల బాలరాజ్ (32) సొంత పనిపై హైదరాబాద్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి నర్సాపూర్ మీదుగా స్వగ్రామానికి వస్తున్నాడు. నర్సాపూర్‌కు చెందిన చింతకుంట నవీన్ (26) బైక్‌పై సంగారెడ్డి వైపు నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వస్తూ ఎదురుగా వస్తున్న బాలరాజు బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో బాల్‌రాజు అక్కడికక్కడే మృతి చెందగా నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు, కుటుంబ సభ్యులు నవీన్‌ను నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అతడు మృతి చెందాడు. బాలరాజ్ భార్య సుమలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాలరాజుకు భార్య, పిల్లలు ఉన్నారు.

మరో ఘటనలో వ్యక్తి..

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని పులిమామిడి శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామాయంపేట మండలం దొంగల ధర్మారం గ్రామానికి చెందిన గఫార్(40) దౌల్తాబాద్‌కు బైకుపై డీజిల్ తీసుకురావడానికి వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో బైకు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో గాయపడిన అతడిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తూప్రాన్: అప్పుల బాధతో గడ్డి మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శివానందం కథనం ప్రకారం..పట్టణానికి చెందిన గజ్జల బాబు (28) కొన్నేళ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పోషణ భారంగా మారడంతోపాటు అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 18న గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇద్దరు దొంగలు రిమాండ్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని వెంకటాపూర్ కే గ్రామంలో ఈ నెల 4న బాలచంద్రం గారి ఇంటిలో దొంగతనం జరిగింది. ఈ కేసులో ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రాజేశ్ కథనం మేరకు... శుక్రవారం దొంగతనం కేసు విచారణలో భాగంగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి సొత్తును రికవరీ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచారు. కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు విజయకుమార్, నవీన్, అమీర్ సోహైల్, డ్రైవర్ రమేశ్‌ను ఎస్ఐ అభినందించారు.

మహిళ బ్యాగులోంచి నెక్లెస్ చోరీ

గజ్వేల్‌రూరల్: మహిళ బ్యాగులోంచి బంగారు నెక్లెస్ చోరీకి గురైంది. ఈ ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మెదక్ జిల్లా చిట్యాలకు చెందిన మాసగోని లావణ్య ఈనెల 23న ఆర్టీసీ బస్సులో తూప్రాన్ నుంచి గజ్వేల్‌కు చేరుకుంది. పట్టణంలోని బస్టాప్ వద్ద బస్సు దిగి కొద్ది దూరం నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో ఆమె చేతిలోని బ్యాగును చూడగా తెరిచి ఉంది. వెంటనే బ్యాగులో వెతకగా రెండు తులాల బంగారు నెక్లెస్ కనిపించలేదు. ఇంటికి వెళ్లి భర్త నరేశ్‌కు విషయం చెప్పింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కష్టాల ‘విజయ’కు ఊరట

● సాత్విక భవిష్యత్తుకు ఎమ్మెల్యే హరీశ్ రావు భరోసా
● ఆయన చొరవతో వ్యాపారి చేయూత

సాక్షి ఎఫెక్ట్



సాత్వికకు రెండు లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్ రావు, తిరుమల్ రెడ్డి

సిద్దిపేటజోన్: ఇటీవల విద్యార్థుల అవగాహన సదస్సులో తన తల్లి విజయ పడుతున్న కష్టం తలుచుకొని ఏడ్చిన సాత్వికకు దాతలు చేయూతనందిస్తున్నారు. సాత్విక ఆర్థిక పరిస్థితిపై సాక్షిలో ఈనెల 23న ప్రచురితమైన కష్టాల కడలిలో విజయ తీరం వైపు కథనానికి దాతలు ముందుకు వచ్చారు. సాత్విక కుటుంబ పరిస్థితుల గూర్చి ఆరా తీసిన ఎమ్మెల్యే హరీశ్ రావు చొరవతో ఆర్థిక సాయం లభించింది. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయానికి చిన్నారి సాత్విక, తల్లి విజయను పిలిపించి వారితో కలిసి అల్పాహారం తిన్నారు. అనంతరం తన మిత్రుడి సహాయంతో హైదరాబాద్ వ్యాపారి తిరుమల్‌రెడ్డి ద్వారా రూ.2 లక్షల చెక్కును విజయకు అందించారు. అమ్మ ప్రేమ చాలా గొప్పదని, మంచిగా చదివి భవిష్యత్తులో ఉద్యోగం సాధిస్తే అమ్మ కష్టాలు తీరినట్టేనని సాత్వికతో ఎమ్మెల్యే ఆత్మీయంగా అన్నారు. భవిష్యత్తులో విద్యాపరంగా అండగా ఉంటానని వారికి భరోసానిచ్చారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్

పర్సును ప్రయాణికురాలికి అందజేసిన డీఎం



పర్సులో ఉన్న బంగారం, నగదును ప్రయాణికురాలికి అందజేస్తున్న డీఎం టి.రఘు

సిద్దిపేటకమాన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు మరిచిపోయిన పర్సును కండక్టర్ గుర్తించి డీఎంకు అందజేసి తన నిజాయితీ చాటుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట పట్టణం మోడ్రన్ బస్టాండ్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. సిద్దిపేట డిపో మేనేజర్ టి.రఘు వివరాల ప్రకారం... డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కామారెడ్డి నుంచి సిద్దిపేటకు వస్తున్న క్రమంలో సిరికొండ మండలం పెద్దవాల్గొట్ గ్రామానికి చెందిన ప్రయాణికురాలు నీరజ బస్సులో వస్తున్నది. ఆమె ముస్తాబాద్‌లో బస్సు దిగే క్రమంలో పర్సు మరిచిపోయింది. దీంతో సిద్దిపేటకు వచ్చిన తరువాత బస్సులో ఉన్న పర్సును కండక్టర్ వేణుగోపాల్ గుర్తించి డిపో మేనేజర్‌కు అందజేశాడు. అనంతరం పర్సులో ఉన్న 10గ్రాముల బంగారం, రూ.10వేలను సిద్దిపేట మోడ్రన్ బస్టాండ్‌లో ప్రయాణికురాలికి డీఎం, స్టేషన్ మేనేజర్ బాలకిషన్, సెక్యూరిటీ సురేశ్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రయాణికురాలు డీఎంకు కృతజ్ఞతలు తెలిపింది. ఆర్టీసీ బస్సులో తాను ప్రయాణం చేయకుండా ఉంటే నష్టం జరిగేదని ఆమె పేర్కొన్నారు.

త్వరలో వ్యవసాయ కళాశాలకు శంకుస్థాపన

ఎస్‌డబ్ల్యూజీ కార్యదర్శి అలుగు వర్షిణి



మాట్లాడుతున్న వర్షిణి, ప్రక్కన కలెక్టర్ మనుచౌదరి, ఎమ్మెల్యే సత్యనారాయణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని తోటపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ కళాశాలకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు రాష్ట్ర సాంఘీక, సంక్షేమ గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి అలుగు వర్షిణి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వర్షిణి మాట్లాడుతూ.. రూ.100 కోట్లతో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు పాలన అనుమతులు ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం నుంచి వచ్చినట్లు తెలిపారు. పది రోజుల్లో సంబంధిత భూమిని కలెక్టర్ అందిస్తారన్నారు. మే నెలలో 47 కోట్లు వెచ్చించి కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని, అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించనున్నట్లు తెలిపారు. గురుకులాల్లో చదివిన విద్యార్థులకు ఈ కళాశాలలో 75 శాతం సీట్లు కేటాయిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణం పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచి ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, ఏఎంసీ చైర్మన్ కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్ గౌడ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపడి వ్యక్తికి గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలో పిడుగు పడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి... శుక్రవారం సురేశ్ మేకలను మేపేందుకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో వర్షం రావడంతో గ్రామ సమీపంలో చెట్టుకింద నిలబడ్డాడు. అదే సమయంలో పిడుగు పడటంతో కిందపడిపోయాడు. గాయాలు కావడంతో అతడి అరుపులను పలువురు గమనించి కౌడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.